
## కొత్త-యువరచయి(త్రి)తలు:

# స్మశానం

ఆంధ్రజ్యోతి ఎమెస్కో రైటర్స్ వర్క్‌షాప్‌కి హాజరయిన వర్ధమాన రచయిత్రి కథ

వి. ప్రతిమ



చల్లగా కురుస్తోన్న మంచు తూర్పున విచ్చుకుంటోన్న వెలుగు రేఖల తాకిడికి విడిపోతోన్న వేళ...

వేడి వేడి కాఫీ ఒక్కొక్క గుక్కగా గొంతులో దిగుతూంటే లోపలి వేడినీ, బయటి చల్లదనాన్నీ ఒకేసారి అనుభూతిస్తూ పేపరు చూస్తున్నారు జయరామారావుగారు.

"ఏమిటి తాతయ్యా న్యూస్" ప్రక్కనే కుర్చీలో కూర్చుని సాక్స్ తొడుక్కుంటూ ప్రశ్నించాడు సుమంత్.

"వచ్చావా మనవడా! అప్పుడే ఏంటీ హడావిడి" మనవడి వంక ఆత్మీయంగా చూస్తూ ప్రశ్నించాడు జయరామారావు.

"అవును ఇవ్వాళ్టి నుండీ మార్నింగ్ స్కూలు...ట్యూషను కెళ్ళి అట్నుండటు వెళ్ళిపోతాను. ఇంతకీ న్యూసేమిటో చెప్పు తాతయ్యా... హెడ్‌లైన్స్ చెప్పు చాలు."

ఇంత చిన్న వయసులోనే ప్రపంచాన్ని గురించి తెలుసుకోవాలన్న వాడి జిజ్ఞాసకి ముచ్చటేసింది జయరామారావుగారికి.

"ఏముంది నాన్నా గోదావరిలో పడవ మునిగి ముప్పయి మంది ప్రయాణీకుల దుర్మరణం... రిజర్వేషన్ల గొడవల మూలంగా ఓ రైలు బోగీకి నిప్పంటించడంతో అందులో వుండిపోయిన ప్రయాణీకులు సజీవ దహనం చెందారు."

"సర్లె తాతయ్యా సాయంత్రం వచ్చి వింటాను నాకు స్కూలుకి టైమైంది వస్తానూ"

* * *

"తాతయ్యా... తమ కోర్కెలు తీర్చుకోడం కోసం సైకులు చేయడం వరకూ అయితే సరేకానీ యిలా ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించడం అందునా అమాయకులైన ప్రయాణీకుల్ని సజీవ దహనం చేయడం, ఇదంతా ఎంత దారుణమో కదా తాతయ్యా...ఇలా ఎందుకు చేస్తారు మనుషులు" ఆ రాత్రి తాత పక్కలో పడుకుని ఆయన మెడ చుట్టూ చేతులు వేసి దిగులుగా ప్రశ్నించాడు సుమంత్.

పదేళ్ళు కూడా నిండని తన మనవడి ఆలోచనకు ముగ్ధులయ్యారాయన. నిజమే అమాయకులైన ప్రయాణీకులని దహనం చేసి ఈ మనుషులు తమ తమ కోర్కెలు సాధించుకోగలరా?

"మామయ్యా బాబునిలా పంపండి" అంటూ కోడలు పిలవడంతో ఉలిక్కిపడి మెల్లిగా బాబుని లేపి తీసికెళ్ళి అందించారు. తన దగ్గర పడుకుంటే తన జలుబూ, దగ్గూ సుమంత్‌కి అంటుకుంటాయేమోనని కోడలి ఆందోళన.

"తాతయ్యా...తాతయ్యా మన అత్తరు సాయిబు నెవరో చంపేశారు తాతయ్యా" ఒడిలో తలదాచుకుని

ఖావురు మన్నాడు సుమంత్.

ఆశ్చర్యంతో నోట మాట రాలే దాయనకి.

అత్తరు సాయిబు ఈ వీథిలోనే ఓ చివరగా వుంటాడు. అత్తర్లూ, అగరొత్తులూ తెచ్చి అమ్ముకుంటుంటాడు. అంతా అతడ్ని అత్తరు సాయిబు అంటూ పిలవడమే తప్ప అతడి అసలు పేరెవరికీ తెలీదు...మతోన్మాదం అత్తరు సాయిబుని బలి తీసుకుందన్నమాట...జయరామారావుగారి హృదయం బాధగా మూలిగింది.

"తాతయ్యా మతం అంటే ఏమిటి తాతయ్యా" ఆ రాత్రి తాత ప్రక్కన చేరి మృదువుగా ప్రశ్నించాడు సుమంత్.

సుమంత్‌కి ఏ సందేహమొచ్చినా సాధారణంగా తాతగారినే అడుగుతుంటాడు. ఎందుకంటే తాతయ్య నాన్నగారిలా.

"అవన్నీ నీకెందుకు చెప్పు. చెప్పినా అర్థం కావు" అంటూ కొట్టిపారేయడు. తనకి అర్థమయినా,

కాకపోయినా విడమరిచి చెప్పడానికే ప్రయత్నిస్తాడు.

"చూడు నాన్నా నీలోనూ, నాలోనూ ప్రతి వ్యక్తిలోనూ దేవుడున్నాడు...ఒకే ఒక కులం వుందిక్కడ విశ్వమానవ కులం. ఈ లోకానికంతటికీ కలిసి ఒకే ఒక మతం మానవత్వం..." మనవడికో సమగ్రమైన అవగాహన రావడం కోసం ప్రయత్నిస్తున్నారాయన. కొంత వరకూ అర్థమైనట్లుగా తలూపి.

"తాతయ్యా, మనదంతా ఒకే మతం మానవత్వం అంటున్నారు కదా. మరి ఈ మత కల్లోలాలు ఏమిటి తాతయ్యా, పోనీ మన మతం, మన దేవుడు వాళ్ళకి నచ్చవని అనుకున్నా నా ఫ్రెండ్ అజీజ్ నా వద్ద వెంకటేశ్వర స్వామి గ్రీటింగ్ కార్డు కోసం ఎంతగా బతిమాలి తీసుకున్నాడో తెలుసా?

మన రాముడన్నా, శివుడన్నా కూడా వాడికి ఎంతో యిష్టం...మేమంతా కలిసి డేవిడ్‌తో ఎన్నిసార్లు చర్చికి వెళ్ళలేదు..." మనవడి వంక చూస్తూ మౌనంగా వుండిపోయారాయన.

శివమెత్తిన ఈ మతోన్మాదపు రాక్షసులు చేసే రక్తపాతం, ఈ హింసాకాండ పసితనపు కుత్తుకలపైనా, వృద్ధాప్యపు ముడతలమీదా మృత్యువు మోపే తడి పాదాల గురించీ, ఆ పసివాడికి అర్థమయ్యేలా చెప్పడమా, మానడమా అని సందిగ్ధావస్థలో వున్న జయరామారావుగారు కోడలు సుమంతుని రమ్మని పిలవడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

* * * యూనిట్ పరీక్షలు జరుగుతూండడంతో సుమంత్ తొమ్మిదింటి వరకూ చదువుకుని వార్తలు చూస్తోన్న తాతగారి ప్రక్కనే వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"అప్పుడే బాబుని రమ్మని పిలిచారా? ఇంకా వాడికి చదువు పూర్తి కాలేదు" కొంచెం కఠినంగా చెప్పింది కోడలు జయప్రద. ఆ అమ్మాయి మాటల్లో

"మీరు సరే పనీ పాటా లేకుండా తిని కూర్చుని టి.వి. చూస్తున్నారు. చదువుకునే కుర్రాణ్ణి అలా పాడుచేయడమేంటి?" అన్న శ్లేష వుంది.

తాతయ్యకేమైనా బాధ కల్గుతుందేమోనన్నట్లుగా ఆయనకేసి చూశాడు సుమంత్. వెంటనే తల్లి వంక తిరిగి,

"తాతగారు నన్ను పిలవలేదమ్మా, నాకు పోర్షనంతా అయిపోయింది, అందుకని యిలా వచ్చి కూర్చున్నాను."

"సర్లె పాలు తాగుదూగాని రా" విసురుగా పిల్చింది తల్లి.

టి.వి.లో హిందీ వార్తలు వస్తున్నాయి. సిటీలో వుండడంతో సుమంత్‌కి హిందీ బాగా అర్థమవుతుంది.

"ఈ రోజు మధ్యాహ్నం మూడు గంటలకి శాసనసభ్యుడు వినయ్ కుమార్‌ని తీవ్రవాదులు కిడ్నాప్ చేసి తీసుకువెళ్ళారు. అడ్డు రాబోయిన ఆయన బాడీ గార్డుల్ని తీవ్రంగా గాయపరిచారు. ఈ గొడవలో వినయ్ కుమార్ గారికి కూడ స్వల్పంగా గాయాలైనట్లు తెలిసింది.

ఈ మధ్యనే పోలీసులు అరెస్ట్ చేసిన తమ నాయకులు అశోకన్న, భీమన్నలను విడుదల చేస్తేనే తప్ప వినయ్ కుమార్‌ని వదిలి పెట్టేది లేదంటూ స్పష్టం చేసి వెళ్ళారు. శాసనసభ్యుడి కిడ్నాప్ పట్ల ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతిని వెల్లడిచేశారు"

వార్త వింటూనే జయరామారావు గారు మెల్లిగా తలతిప్పి మనువడి వంక చూశారు.

ఆయనకు తెలుసు. ఇక ఆ వార్తని గురించిన పూర్వాపరాలపట్ల సుమంత్ వేయబోయే ప్రశ్నలను ఎదుర్కోవడానికి తను సిద్ధపడి వుండాలి. అశోకన్న, భీమన్న ఎవరంటూ మొదలు పెడతాడేమో.

ఇంత చిన్న వయసులోనే మరీ ఈ ప్రపంచపు నగ్న స్వరూపాన్ని చూడడమెందుకీ కుర్రాడు... అనుకొంటూ మనవడ్ని దగ్గరకు తీసుకుబోతూండగా.

"పాలు తాగుదువుగాని రమ్మని పిలిచానా?" తల్లి పిలుపు మళ్ళీ.

"తాగాలని లేదమ్మా ప్లీజ్" ఆ పలకడంలో 'నేను తాతయ్యతోనే పడుకుంటాను సుమా' అన్న అభ్యర్థన వుంది.

"సుమంత్ అసలే నీకు పరీక్షలు జరుగుతున్నాయి. నువు ఉదయాన్నే కొంచెం ఎర్లీగా లేవాలి. నా గదిలో పడుకుందువుగానిరా" అంటూ శాసించింది జయప్రద.

ఇక ఆ మాటకు తిరుగులేదు.

దీనంగా తాతగారి వంక చూశాడు సుమంత్. ఇది కూడ ఒకందుకు మంచిదే...లేదంటే ఇవ్వాల్టి రాత్రికి తీవ్రవాదాన్ని గురించి సంపూర్తిగా తెలుసుకోనిదే నిద్ర పోడీ పిల్లాడు.

"గుడ్ నైట్ తాతయ్యా" తాత బుగ్గమీద ముద్దుపెడ్తూ చెప్పాడు సుమంత్.

"గుడ్‌నైట్ బాబూ త్వరగా లేచి చదువుకోవాలి కదా. ఆదివారం నా దగ్గర పడుకుందువుగాని"

* * * వారం తరువాత మాజీ మంత్రి, ప్రముఖ నాయకుడూ అయిన సుగ్రీవాచారి హత్య గురించి సుమంత్ పేపర్లో చదివి వుండక పోయినట్లయితే నక్సలిజం గురించి అంత త్వరగా తాతయ్యని ప్రశ్నించేవాడు కాదేమో.

"తాతయ్యా నక్సలిజం అంటే ఏమిటి? వీళ్ళెందుకిలా హత్యలు చేస్తుంటారు? హత్యలు చేయడమే వీరి వృత్తా?"

ఇక నోరు విప్పక తప్పలేదు జయరామారావుగారికి.

"హత్యలు చేయడం వారి వృత్తి కాదు నాయనా—మనుషులంతా ఒకటే అయినపుడు కొంత మంది రోడ్లంబడి తిరుగుతూ ఫుట్‌పాత్‌ల మీద పడుకుంటూ వుంటే మరి కొందరు బంగళాల్లో నివసిస్తూ కార్లలో తిరగడమేంటి? కాబట్టి సమ సమాజాన్ని నిర్మించాలని...అదే సమసమాజవాదం వీరి సిద్ధాంతం."

"ప్చ్ తాతయ్యా మరి అదే నిజమైతే వీళ్ళిలా వరుసగా డబ్బున్న వాళ్ళందరినీ చంపేస్తూంటారా?

ఇలా అందరినీ చంపుతూ పోతుంటే వీళ్ళ కోరికలూ, సిద్ధాంతాలూ నెరవేరతాయా?

తమ తరంలో తీవ్రవాదుల మీదా, వారి సిద్ధాంతాల మీదా ఎదుగుతోన్న పిల్లలకి ఒక విధమైన అభిమానం, గౌరవం తాము కూడా సమసమాజ వాదాన్ని అనుసరించాలనే ఆలోచనా వుండేది.

కానీ రాను రాను ఈ నక్సలైట్ల కార్యకలాపాలు తీవ్రరూపం దాల్చి ఎక్కువగా హత్యా రూపంలో బయటపడ్తున్నాయి.

వ్యవస్థను మార్చడం ద్వారా విప్లవాన్ని సాధించాలనే ఆశయం ఏనాడో గాలి కెగిరి పోయింది. మహత్తరాశయాల పేరుతో ప్రారంభమైన ఈ విప్లవోద్యమాలు రాను రాను వ్యక్తి హింసగా, నిర్హేతుక హత్యాకాండగా మారి అమాయక ప్రజలను భయ భ్రాంతులను చేస్తున్నాయి. ఈ తరం పిల్లలకి తీవ్రవాదం అంటే హత్యలు చేయడం కాబోలుననే ఓ చెడు భావం కలుగుతోంది.

* * *

ఆ రోజు ఆదివారం - ఉదయం ఎనిమిదయింది. పాలగ్లాసు తీసుకుని వచ్చి తాతయ్య ప్రక్కన కూర్చున్నాడు సుమంత్ "ఏంటి తాతయ్యా న్యూస్" అంటూ

"అబ్బ మనవడా ఈ మాట విని చాల రోజులయిందిరా. ఏమిటే పరీక్షలు అయిపోయినయ్యా ఏంటీ?"

"అదేం లేదు పొద్దుట్నుంచీ చదువుకున్నాను. ఆదివారమే కదా అందుకని ఇలా వచ్చాను"

"అలాగా"

ఆ ఇంతకీ న్యూసేంటి అంటే చెప్పవేం?"

"ఆ చెప్తున్నాను విను" గొంతు తగ్గించి కోడలు వింటుందేమోనని మెట్టూ చూస్తూ భయంగా చెప్పాడు.

"రాత్రి నక్సల్స్‌కీ, పోలీసులకీ భీకరమైన పోరాటం జరిగింది. ఎక్కడో తెలుసా? ఖమ్మం జిల్లా, అడవుల్లో, అసలు మన దేశంలో ఉద్యమకారుల చరిత్రలోనే ఇంత పెద్ద ఎన్‌కౌంటర్ ఇంతవరకూ జరగలేదట. దాదాపు పన్నెండు మంది ఉద్యమకారులు చనిపోయారని తెలిసింది"

"అసలీ ఎన్‌కౌంటర్ ఎందుకు జరిగింది తాతయ్యా! పోలీసులు కాల్పులెందుకు జరిపారు?"

"అదా ఈ మధ్యన ఉద్యమకారులు రెండు ప్రదేశాల్లోని పోలీస్ స్టేషన్లను పేల్చి వేశారు. ఇప్పుడు మళ్ళీ మరో ఊరిలోని పోలీస్ ఔట్ పోస్ట్‌ను పేల్చివేసేందుకు వ్యూహం సిద్ధం చేశారని పోలీసులకు తెలిసింది. దాంతో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. పది గంటల పాటు సాగిందన్న మాట ఈ పోరాటం"

"ఏదీ ఇలా ఇవ్వు తాతయ్యా పేపరు చూస్తాను"

పది నిముషాల పాటు ఆ పేజి అంతా చదివిన తరువాత మౌనంగా వుండి పోయాడు సుమంత్.

"ఏమిట్రా మనవడా అంత గంభీరంగా వున్నావు?" సుమంత్‌ని ఆ మూడ్‌లో నుండి బయటికి తీసుకు రావడానికన్నట్లుగా సరదాగా పిలిచారు జయరామారావుగారు.

"ఏం లేదు తాతయ్యా నాకెందుకో భయంగా వుంది. మళ్ళీ ఆ నక్సలైట్లు వాళ్ళ మనుషుల్ని చంపారనే కోపంతో పోలీసుల్ని చంపేస్తారేమో తాతయ్యా"

"నిజమే నాన్నా ... అసలు నిజానికి వీళ్ళు తమకి ఆదర్శ ప్రాయులని చెప్పుకుంటోన్న మార్క్స్, లెనిన్, మావో లెవరూ విప్లవం కోసం నిష్కారణంగా అమాయకులనూ, నిరపరాధులనూ సంహరించమని చెప్పినట్లుగా లేదు ... ఈ హింసాకాండ ద్వారా ప్రజా సానుభూతిని కోల్పోయి ఏం సాధించాలనుకుంటోందో ఈ విప్లవం అర్థం కాదు"

అప్పుడే అక్కడికి వచ్చిన జయప్రద మామగారి మాటలను విని దిగాలుగా కూర్చున్న కొడుకుని చూసింది.

"మామయ్యగారూ మీకు రాను రాను వయసొచ్చే కొలదీ మతి లేకుండా పోతోంది... ఎన్నిసార్లు చెప్పారాయన పసివాడి వద్ద ఈ తీవ్రవాదాలూ, మతకల్లోలాలూ, హత్యలూ ఇవన్నీ మాట్లాడవద్దని ... మీరు చదివేదీ కాక ప్రతిరోజూ వాడికీ విషయం విడమరిచి చెప్పడమెందుకూ?


మీకు తోచడం లేదు. సమయం గడవడం లేదనుకుంటే హాయిగా కృష్ణ మందిరానికి వెళ్ళి భగవద్గీత ఉపన్యాసాలు జరుగుతున్నాయి వినండి... లేదా స్నేహితుల ఇళ్ళకు వెళ్ళి సరదాగా కాసేపు గడిపి రండి... వెళ్ళి కూరలు తీసుకు రండి. అంతేకానీ పసివాడిని కూర్చుండ బెట్టుకుని ఎంత సేపటికీ దొంగతనాలూ, హత్యలు గురించి చర్చించకండి" కోపంగా అనేసి సుమంతుని చేయి పట్టి లోపలికి లాక్కెళ్ళింది కోడలు.

ఎంత సరిపెట్టుకుందామని అనుకున్నా దెబ్బతిన్న అహం కనుకొలకుల నుండి తొంగి చూసింది జయరామారావుకి.

భారంగా నిట్టూర్చి బుట్ట చేత్తో పట్టుకుని కూరలు తీసుకోరావడం కోసం బయటికి నడిచారాయన.

* * *

సరిగ్గా నాలుగు రోజులు కూడా గడవక ముందే పసివాడు సుమంత్ వూహించినట్లుగానే ఉద్యమకారులు మందుపాతరలు పెట్టి పోలీస్ జీప్‌ని పేల్చి వేశారు. ఇద్దరు ఎస్.ఐ.లూ,




ఒక సి.ఐ. అయిదు మంది కానిస్టేబిల్సూ అక్కడికక్కడే మరణించారు అంటూ కాలిన మృత దేహాలని కూడా టి.వి.లో చూపించారు.

వార్త విన్న వెంటనే తాతయ్య మెడ చుట్టూ చేతులు వేసి ఆయన గుండెల్లో తలదాచుకున్నాడు సుమంత్. కోడలు కోప్పడిన దగ్గర్నుండీ ఈ హత్యావార్తలూ, నక్సలిజం గురించీ మనవడితో మాట్లాడకుండా చాలా జాగ్రత్తగా వుంటున్నారు జయరామారావుగారు.

టి.వి.లో వార్తలు కూడా ఆయన పెట్టడం లేదు. ఆ రోజు కొడుకు త్వరగా వచ్చి టి.వి. ఆన్ చేశాడు. అప్పుడే వచ్చిన ఆ వార్తని విన్న సుమంత్ గట్టిగా తాతయ్యని కౌగిలించుకున్నాడు.

మనవడి తల, వీపు నిమురుతూ గాఢంగా నిట్టూర్చారాయన.

"నువ్వూహించిందే నిజమైందిరా మనవడా" అనుకుంటూ.

చాలా సమయం గడిచింది. టి.వి. ఆఫ్ చేసి భార్యతో ద్రాక్ష తోటల కొనుగోలు గురించి సీరియస్‌గా చర్చిస్తున్నాడు చంద్రశేఖరం.

తాతయ్య కౌగిలిలో నుండి విడివడి ఆయన కళ్ళల్లోకి లోతుగా, దీనంగా చూశాడు సుమంత్.

"తాతయ్యా! నువ్వు చెప్పు తాతయ్యా డాడీతో మనకు ద్రాక్ష తోటలొద్దు. మనకి చాలా స్మశానాలు కావాలి. తాతయ్యా స్మశానం కొని పెట్టుకుందామని చెప్పు తాతయ్యా" దీనంగా చెప్పాడు.

ఆర్ద్రంగా మనవడ్ని దగ్గరకు లాక్కుని గాఢంగా గుండెలకు హత్తుకున్నారాయన.

జయరామారావుగారి కళ్ళు చెమ్మగిల్లాయి. మనవడి మనసును అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారాయన.

ఆయనకి తన పదేళ్ళ ప్రాయం జ్ఞప్తికొచ్చింది.

"బళ్ళెగ్గొట్టి మధ్యాహ్నం వేళల మామిడి తోపుల్లో కోతి కొమ్మచ్చి ఆటలాడ్డం తోట మాలికి తెలీకుండా కాయలు రాల్చుకు తినడం, సాయంత్రం అమ్మ ఒడిలో కూర్చుని గోరు ముద్ద లారగించడం ... వెన్నెల రాత్రులలో ఆరు బయట నాన్నమ్మ ప్రక్కలో పడుకుని కథలు వినడం ... ప్చ్ తన కొడుకు తరం వచ్చేప్పటికే ఈ ఇంగ్లీషు చదువుల కోరల్లో చిక్కుకుని ఈ తరం పిల్లలంతా ఎంత అందమైన బాల్యాన్ని పోగొట్టుకుంటున్నారా అంటూ వాపోయేవాడు తను ... కానీ ఈ మూడో తరం పిల్లలు ఎంత భయంకరమైన సమాజాన్ని, దారుణమైన హింసా కాండనీ చవిచూస్తూ ఎంత భయభ్రాంతులతో ఎదుగుతున్నారో తలచుకుంటే ఆయన గుండె తరుక్కు పోయినట్ల యింది.

29-5-92 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక